క్లుప్తంగా

వేగంగా దేశమ్మ ఆలయ నిర్మాణ పనులు



నిర్మాణ పనులపై చర్చిస్తున్న ఎండోమెంట్ డీఈ

నగరి: నేత్ర దేవత దేశమ్మ దేవాలయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆలయాన్ని నూతనంగా బ్రహ్మాండంగా నిర్మించడానికి మంత్రి ఆర్కేరోజా రూ.1.20 కోట్లు మంజూరు చేయించారు. దీంతో ఆలయాన్ని వేగంగా నిర్మిస్తున్నారు. ఆలయ గోపుర పనులను ఎండోమెంట్ డీఈ శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. సలహాలు, సూచనలు అందించారు. ఆయన వెంట ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ఆలయ అధికారులు ఉన్నారు.

సిమెంట్ రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

నగరి: గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పద్మావతి నగర్ గుంటకట్ట వీధిలో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు పనులను మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో మంత్రి ఆర్కేరోజా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించే సమయంలో స్థానికులు రోడ్డు కావాలని కోరారని.. స్పందించిన ఆమె నిధులు మంజూరు చేయించడంతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమైందన్నారు. కౌన్సిలర్ ఇంద్రయ్య, డీఈ నరేశ్, ఏఈ రమేష్ పాల్గొన్నారు.

చెరుకు తోట దగ్ధం



కాలిపోయిన చెరుకు తోట

పాలసముద్రం: మండలంలోని రాచపాళ్యంలో శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ తీగల మధ్య రాపిడి జరిగి నిప్పు రవ్వల కారణంగా చెరుకు తోటలో మంటలు చెలరేగాయి. గ్రామానికి చెందిన శేఖర్‌రాజు చెరుకు తోట దగ్ధమైంది. సుమారు రూ. లక్ష నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు.

పశువులకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

పాలసముద్రం: మండల పరిధిలోని పాడి పశువులకు ముద్దచర్మ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశువైద్యాధికారి యశస్వి అన్నారు. శుక్రవారం క్రిష్ణజమ్మపురం గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పాడి పశువులకు చర్మంపై బిల్లల ఆకారంతో బొబ్బలు రావడం, మేత సరిగ్గా తీసుకోకపోవడం వంటివి ఉంటే ముద్దచర్మ వ్యాధి లక్షణాలుగా భావించవచ్చని తెలిపారు. అలాంటి వ్యాధి నుంచి కాపాడుకోవాలంటే తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని తెలిపారు. నాలుగు నెలలు పైబడిన దూడలకు, పశువులకు టీకాలు వేయించాలన్నారు. అనంతరం పశువులకు టీకాలు వేశారు.

త్వరలో ఎస్పీడబ్ల్యూ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి

తిరుపతి సిటీ : పద్మావతీ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు త్వరలో స్వయం ప్రతిపత్తి హోదా లభించనుందని టీటీడీ విద్యాశాఖ అధికారి భాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎస్వీ డబ్ల్యూ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం 72వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించిందన్నారు. ఇక్కడ ఎంతో మంది విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలు అందుకున్నారని తెలిపారు. గత టీటీడీ ఈవో జవహర్‌రెడ్డి, ప్రస్తుత ఈవో ధర్మారెడ్డి, జేఈవో సదాభార్గవి సహాయ సహకారాలతో కళాశాల న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించిందన్నారు. ప్రిన్సిపాల్ మహాదేవమ్మ మాట్లాడుతూ ఈ కళాశాల నుంచి ప్రతి ఏటా సుమారు 1200 మంది విద్యార్థినులు డిగ్రీ పట్టాలు పొందుతున్నారని తెలిపారు. సివిల్ ఇంజినీర్ దామోదరం, విశ్రాంత ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మీ, పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి రూరల్: మండలంలోని పలు పంచాయతీల్లో 112 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు ఈనెల 20వ తేదీ లోపుదరఖాస్తు చేసుకోవాలని రూరల్ ఎంపీడీవో వెంకటనారాయణ తెలిపారు. తిరుచానూరు-49, పాడిపేట-25, శెట్టిపల్లి-17, పద్మావతిపురం-6, అవిలాల-5, సీమల్లవరం-2, పేరూరు, చిగురువాడ, బ్రాహ్మణపట్టు పంచాయతీల్లో ఒక్కోటి చొప్పున పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.



నగరి: నా భూమి నాదేశం కార్యక్రమంలో గ్రామస్తులు



జీడీనెల్లూరులో ర్యాలీ



పాలసముద్రం: మాజీ సైనికులకు సన్మానం

వాడవాడలా నా భూమి.. నా దేశం

నగరి: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా వాడవాడలా నా భూమి నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం మాంగాడు గ్రామంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది స్థానిక పాఠశాల ఆవరణలో నా భూమి, నా దేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రంగు, రంగుల ముగ్గులతో అలంకరించారు. మొక్కలు నాటారు. అందరికీ మట్టిని అందించి ప్రతిజ్ఞ చేయించారు. ప్రతిజ్ఞ అనంతరం మట్టిని కుండల్లో సేకరించారు. ఆ మట్టిని అధికారుల ద్వారా ఢిల్లీలో జరిగే ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు ఉత్సవాలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీష్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, గోవిందయ్య పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకుందాం

గంగాధరనెల్లూరు: దేశానికి స్వాతంత్య్రం కోసం పోరాటం చేసిన సమరయోధులను స్మరించుకుందామని ఎంపీడీఓ శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని బుగ్గపట్నం గ్రామంలో నా దేశం–నా భూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి మనిషి మాతృభూమికి ఏదైనా చేయాలన్నారు. స్వచ్ఛమైన గాలి, నీరు, సారవంతమైన నేల భావితరాలకు అందించడం కోసమే నా మట్టి, నా దేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మొక్కలు నాటి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, సర్పంచ్ మునిరాజారెడ్డి, ఏపీఓ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ శివయ్య పాల్గొన్నారు.



పాలసముద్రం: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అమర వీరుల స్థూపం ఆవిష్కరణ

పాలసముద్రం: అమర వీరుల సేవలు వెలకట్టలేనివని పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ ఎస్ శివప్రకాష్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్‌యాదవ్ అన్నారు. మండలంలోని నరసింహపురం, గంగమాంబాపురం, కోదండరామాపురం, శ్రీకావేరిరాజపురంలో నా భూమి–నా దేశం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. పాంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. మాజీ సైనికులు విశ్వనాథనాయుడు, మోహన్‌ను ఘనంగా సన్మానించారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కులు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, సర్పంచ్ గాలి మహేష్‌బాబు, ఏపీఓ మార్గరేట్, జేఈ అనుషా, పంచాయతీ కార్యదర్శి యశ్వత్, పారిశుద్ధ్య కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ సేవలో భాగస్వాములు కావాలి

శ్రీరంగరాజపురం: మండలంలోని వీవీపురం, 49 కొత్తపల్లి, కటికపల్లి, ఎస్‌ఆర్ పురం, ఈకే కండ్రిగ, పుల్లూరు గ్రామాల్లో నా మట్టి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కృష్ణయ్య మాట్లాడుతూ.. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా నా మట్టి–నా దేశం, వీరులకు వందనం కార్యక్రమాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని అన్నారు. దేశ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలని కోరారు. స్వాతంత్య్ర సమరయోధుల ఆశయ సాధనకు కృషి చేయలన్నారు. అనంరతం శిలాఫలకాన్ని ప్రారంభించి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ లక్ష్మమ్మ, డీల్లయ్య, మార్కండయ్య, బాబు, దీలీప్‌రెడ్డి, నాయకులు దామునాయుడు, లోకనాథరెడ్డి, దాము ఆచారి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో మేము సైతం

కార్వేటినగరం: దేశ రక్షణ, ఐక్యతకు పాటు పడుదామని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయలురెడ్డి అన్నారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్య్రం తీసుకొచ్చిన సమరయోధులను స్మరించుకుంటూ, దేశసేవకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాల సుబ్రమణ్యం ఆచారి, సీఎస్ లత, రాజశేఖర్, కార్తీక్, బాబు, రవి, లోకేష్ పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం

వెదురుకుప్పం: నా మట్టి –నా దేశం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఎంపీపీ బండి నాగరాణి అన్నారు. అనంతరం రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బండి హేమసుందర్ రెడ్డి, సర్పంచ్ కావేరి, శ్రీనాథరెడ్డి పాల్గొన్నారు.



శ్రీరంగరాజపురంలో..



వెదురుకుప్పంలో..



కార్వేటినగరం: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం

పెనుమూరు(కార్వేటినగరం) : సంక్షేమ పథకాల లబ్ధితో ఇంటింటా సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల మద్దతు పుష్కలంగా ఉందని, ఇందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందనే నిదర్శమని తెలిపారు. శుక్రవారం పెనుమురు పంచాయతీ చిప్పారపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాలను లబ్ధిదారులకు వివరించారు. అమ్మఒడి, విద్యాదీవెన, డ్వాక్రా రుణాలు పూర్తి స్థాయిలో అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలకు సంక్షేమాలు అందించి ప్రజల మనసుల్లో సీఎం చిరస్థాయిగా నిలిచి పోయారని పేర్కొన్నారు. జీడీ నెల్లూరు ఎస్సీ నియోజక వర్గాన్ని ముఖ్యమంత్రి దత్తకు తీసుకుని ఎక్కడ లేని విధంగా అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో సత్యవేడు ఎమ్మెల్యేగా పనిచేశానని, వైఎస్సార్ ఆశీస్సులతో శ్రీసిటిని తీసుకొచ్చి వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి, సత్యవేడును ఇండ్రస్ట్రీ హబ్‌గా మార్చి జిల్లాకు తలమాణికంగా నిలిపానని, సీఎం జగనన్న హయాంలో జీడీ నెల్లూరు ఎమ్మెల్యేగా, ఉప ముఖ్యమంత్రిగా నియోజకవర్గాన్ని రెండో పులివెందులగా తీర్చి దిద్దేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. చంద్రబాబు అధికారం కోసం మళ్లీ కుయుక్తులు చేస్తున్నారని, ఆయన మాటలు నమ్మితే సంక్షేమ పథకాలను మనమే ఎసరు పెట్టుకున్నట్లు అవుతుందన్నారు. టీడీపీ, జనసేన మునిగి పోయే నావలని, వారి హామీలను నమ్మవద్దని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, నాయకులు దూదిమోహన్, యతీశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పాడిరైతులకు చాఫ్‌కట్టర్ల పంపిణీ



చాఫ్‌కట్టర్‌లు అందిస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురం: మండలంలోని పాడి రైతులకు రాయితీపై చాఫ్‌కట్టర్‌లను అందజేస్తున్నట్లు సంవర్ధక శాఖ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ గోవిందయ్య అన్నారు. మండలానికి 44 చాఫ్‌కట్టర్లు వచ్చాయని తెలిపారు. రూ. 33,970 విలువ చేసే చాఫ్‌కట్టర్‌ను రాయితీ పోను రూ. 20,382కే అందిస్తామన్నారు. అర్హులైన వారు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం తయ్యూరు పశు వైద్యశాలలో సచివాలయం సిబ్బందికి, గోపాలమిత్రలకు లంపీ టీకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, పశు సంవర్ధకశాఖ ఏడీ రూపసుందరి, పీటీపీ డీడీ వాసు, పీటీపీ ఏడీ హనీఫ్, తహసీల్దార్ లోకనాథ పిళ్లై, ఈఓపీఆర్‌డీ పురుషోత్తం, మండల పశు వైద్యాధికారులు శ్రీవిద్య, నందిని, హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి పట్టాలు

కార్వేటినగరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు మంజూరు చేస్తామని నగరి ఆర్డీఓ సుజన అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎంఎం విలాసం పంచాయతీ ఒడ్డిండ్లు గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను ఆమె సందర్శించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఒడ్డిండ్లలో పర్యటించినప్పుడు గుంట పరంబోకులో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు పట్టాలు మంజూరు చేయాలని గ్రామస్తులు మంత్రిని కోరినట్లు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకే గ్రామాన్ని సందర్శించినట్లు చెప్పారు. ఇళ్ల నిర్మాణానికి అనుకూలమైన ప్రాంతంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేయాలని తహసీల్దార్ రవికుమార్‌ను ఆదేశించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. రీసర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆమె వెంట మండల సర్వేయర్ సురేష్‌బాబు, సచివాలయ సర్వేయర్ చరణ్‌తేజ, వీఆర్వో గోపి పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న నగరి ఆర్డీఓ

పరమేశ్వరమంగళం వార్డు ఏకగ్రీవం!

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని వేపగుంట గ్రామ పంచాయతీ 3వ వార్డు, పరమేశ్వరమంగళం 4వ వార్డు ఉప ఎన్నికల నామినేషన్ల పరిశీలన ప్రక్రియను ఎన్నికల అధికారులు శుక్రవారం నిర్వహించారు. పరమేశ్వరమంగళంలో మూడు నామినేషన్లు రాగా అందులో ఎం.జె.సుజాత నామినేషన్ మాత్రమే చెల్లుబాటు అయినట్లు ఎలక్షన్ ఆఫీసర్ ఎం.మలర్‌విలి ప్రకటించారు. ఎం.రమాదేవి, ఎస్.లతల నామినేషన్లను తిరస్కరించినట్లు తెలిపారు. వేపగుంటలో ఏ.ఉష, ఏ.భారతి, ఏ.మనెమ్మల నామినేషన్లు చెల్లుబాటు అయినట్లు తెలిపారు. దీంతో పరమేశ్వరమంగళం 4వ వార్డు మెంబర్‌గా ఎం.జె.సుజాత ఏకగ్రీవం అయినట్లే. కాగా ఈనెల 19న వేపగుంట 3వ వార్డు మెంబర్‌కు ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఫ్యాప్టో నిరసనను జయప్రదం చేయండి

- ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమచంద్రా రెడ్డి

నగరి: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా శనివారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరగొండ హేమచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పీసీఎన్ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ నగరి మండల కార్యవర్గం సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయవర్గానికి జీవన భద్రత లేని నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 117 వల్ల విద్యా వ్యవస్థ నిర్వీర్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ సుమతి, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్ రెడ్డి, నగరి డివిజనల్ కన్వీనర్ తన్నీరు యువరాజు, జిల్లా కౌన్సిలర్ గంగామోహన్, మండల నాయకులు లక్ష్మీ నారాయణ, నాగభూషణం, నాథముని, రాజశేఖర్, గిరి, నారాయణస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హేమచంద్రారెడ్డి

సమరయోధులను స్మరించుకుందాం



గ్రామ ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న శిరుగురాజుపాళెం గ్రామస్తులు

పుత్తూరు రూరల్: స్వాతంత్ర సమరయోధులను స్మరించుకుంటూ వారి బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని శిరుగురాజుపాళెం సర్పంచ్ మురళీయాదవ్ కోరారు. శుక్రవారం శిరుగురాజుపాళెం పంచాయతీలో నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆజాది కా అమృత్ మహోత్సవ్ శిలాఫలకాన్ని ప్రారంభించి జాతీయ జెండాను ఎగురవేశారు. గ్రామ ప్రజలతో పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేయించారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన సమరయోధులను అనుక్షణం స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

కార్వేటినగరం: మండల పరిధిలోని కొల్లాగుంట జగనన్న లేఅవుట్‌లో ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చొరవతో నియోజకవర్గంలో 75 ఆలయాల నిర్మాణానికి రూ. 7.5 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. అందులో భాగంగా కొల్లాగుంటలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు. అనంతరం వేద పండితులు వేదమంత్రాల నడుమ భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, సర్పంచ్ దివ్య, ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచ్ మునికృష్ణ, గాంధీ, సచివాలయ కన్వీనర్ అయ్యప్ప, వడివేలురెడ్డి పాల్గొన్నారు.



కొల్లాగుంట జగనన్న కాలనీలో భూమి పూజ చేస్తున్న నాయకులు